క్లుప్తంగా

కూలిన మట్టి మిద్దె



వెలుగోడు: మండల పరిధిలోని బోయరేవుల గ్రామంలోని రామాలయ వీధిలో రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి ఓ మట్టి మిద్దె కూలిపోయింది. గ్రామానికి చెందిన పూజారి వెంకటేశ్వర్లు కొన్నేళ్లుగా కుటుంబ సభ్యులతో కలిసి ఓ మట్టి మిద్దెలో నివసిస్తున్నాడు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గది పైకప్పు కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఘటనా స్థలాన్ని రెవెన్యూ అధికారులు పరిశీలించారు

పొలాల్లో నీటి నిల్వలను తొలగించుకోవాలి

వెలుగోడు: పంటల సంరక్షణకు పొలాల్లో వర్షపు నీటి నిల్వను తొలగించుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి స్వాతి రైతులకు సూచించారు. వర్షాల కారణంగా నీరు చేరిన పొలాలను ఆమె సోమవారం పరిశీలించి పలు సూచనలు చేశారు. అధిక వర్షాల వల్ల వరి పంటలో ఆకు ఎండు తెగులు వచ్చే అవకాశం ఉందని, తెగులు మరింతగా వ్యాప్తి చెందకుండా ప్లాంటొమైసిన్ 200 గ్రాములు + కాపర్ హైడ్రాక్సైడ్ 400 గ్రాములు ఎకరాకి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

అత్యవసర సేవల్లో డాక్టర్లు



విధులు నిర్వహిస్తున్న డాక్టర్లు

పాములపాడు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం డాక్టర్లు నాగలక్ష్మీదేవి, మహ్మద్ బేగ్ విధులకు హాజరయ్యారు. డాక్టర్లు విధులను బహిష్కరించి సమ్మెకు పిలుపునిచ్చారు. కాగా అత్యవసర సేవల నిమిత్తం ఇద్దరు డాక్టర్లు విధులకు హాజరై సేవలందించారు.

సూపర్ సేవింగ్ ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ

వెలుగోడు: సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్‌పై సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక సచివాలయం వద్ద ర్యాలీని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం జీఎస్టీని నాలుగు శ్లాబులు నుంచి రెండు శ్లాబులుగా మార్పు చేసిందన్నారు. ఈ నిర్ణయంతో పేద, మధ్యతరగతి వర్గాలకు ఎంతో ఊరట కలుగుతుందన్నారు. ర్యాలీలో హౌసింగ్ ఏఈ, ఏపీఓ, ఏపీఎం, సీసీ, వీఓఏలు, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

జూపాడుబంగ్లా: నాసిరకం విత్తనాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఎం మండల కన్వీనర్ కర్ణ, సీఐటీయూ నాయకుడు రాము సోమవారం ఏఓ కృష్ణారెడ్డికి వినతి పత్రం అందజేశారు. రైతులకు నాసిరకం విత్తనాలు అంటగట్టి మోసం చేసిన నందికొట్కూరు పల్లవీ సీడ్స్ దుకాణం యజమానిపై చర్యలు తీసుకుని, రైతులకు పరిహారం ఇప్పించి ఆదుకోవాలని వారు కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో పార్టీ నాయకులు శ్రీనివాసులు, బాధిత రైతులు దేవదానం, యేసురాజు, దేవభూషణం పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



శ్రీశైలంటెంపుల్: దసరా మహోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైల దేవస్థానం పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. సోమవారం ఆ లయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై గుంటూరుకు చెందిన నటరాజ కళా కూచిపూడి డ్యాన్స్ అకాడమీ వారి సంప్రదాయ నృత్యప్రదర్శన అల రించింది. అలాగే తెనాలికి చెందిన వి.లక్ష్మీసునీత, బృందం భక్తి సంగీత విభావరి నిర్వహించారు.

విద్యుదాఘాతంతో యువకుడికి గాయాలు

బండి ఆత్మకూరు: మండల కేంద్రానికి చెందిన అంకాల లక్ష్మీకాంత రెడ్డి సోమవారం సాయంత్రం విద్యుదాఘాతంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. లక్ష్మీకాంత రెడ్డి తన పశువుల కొట్టం వద్ద తెగిపడిన విద్యుత్ తీగను చూసుకోకుండా తొక్కడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని ఆటోలో నంద్యాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

చదువుల తల్లీ.. నమోస్తుతే!



ఆత్మకూరులో సరస్వతీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

దేవీ శరన్నవరాత్రులను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుంటున్నారు. సోమవారం పలు ఆలయాల్లో అమ్మవార్లు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అందులో భాగంగా ఆత్మకూరు పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలోని అమ్మవారిని పూజారులు చదువుల తల్లిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అలాగే చౌడేశ్వరి ఆలయం, కిసన్‌సింగ్, పాత, కొత్త బస్టాండు వద్దనున్న శివాలయాలు, అంబాభవానీ ఆలయం, మార్కండేయస్వామి ఆలయం, అయ్యప్పస్వామి ఆలయాల్లోని పార్వతీమాత సరస్వతి మాత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

– ఆత్మకూరు





నందికొట్కూరులో.. మిడుతూరులో..

నందికొట్కూరు: పట్టణంలోని శ్రీ చక్ర సహిత వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు లలిత త్రిపుర సుందరి దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. చౌడేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారు సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మిడుతూరులోని వాసవీ కన్యకా అమ్మవారు సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు.





లక్ష్మీదేవి అలంకరణలో చౌడేశ్వరీ అమ్మ వారు

నెహ్రూనగర్‌లో జ్ఞాన సరస్వతిగా..

పాములపాడు: స్థానిక చౌడేశ్వరీ దేవి ఆలయంలో అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మ వారికి పంచామృతాభిషేకం, కళశారాధన, కుంకుమార్చన, ఆకుపూజ, నైవేద్యం, హారతులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పగిడ్యాల: నవరాత్రుల సందర్భంగా అమ్మవారు జ్ఞాన సరస్వతీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి లలిత సహస్రనామంలో పారాయణం చేశారు.



కొలనుభారతి క్షేత్రంలోని అమ్మవారి సన్నిధిలో సాముహిక అక్షరాభ్యాసాలు నిర్వహిస్తున్న దృశ్యం



సరస్వతి దేవిగా కొలనుభారతి దేవి అమ్మవారు



జూపాడుబంగ్లాలో సరస్వతీమాతగా..

జూపాడుబంగ్లా: స్థానిక క్వార్టర్స్‌లోని సరస్వతీదేవి అమ్మవారు, తాటిపాడు వీరభద్రస్వామి ఆలయంలో వెలసిన దుర్గాదేవి అమ్మవారు సరస్వతీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. విద్య, బుద్ధి, వాక్కు, విజ్ఞానం, కలలు అన్నింటికి సరస్వతీదేవి మూలమని అర్చకులు లక్ష్మీనరసింహశర్మ తెలిపారు. ఈ రూపంలో ఉన్న అమ్మవారిని కొలిస్తే విద్య, బుద్ధులు ప్రాప్తిస్తాయని ఆయన తెలిపారు. అనంతరం భక్తులు అమ్మవారికి సాముహిక కుంకుమార్చన, పుష్పార్చన, పంచామృతాభిషేకం వంటి విశేషపూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

కొత్తపల్లి: మండలంలోని కొలనుభారతి క్షేత్రంలో అమ్మవారు భక్తులకు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం 210 చిన్నారులకు సాముహికంగా వేదపండితుల ఆశీర్వచనాల మధ్య భీజాక్షరాలు దిద్దించి అక్షరాభ్యాసాలు నిర్వహించారు.



ఓంకార క్షేత్రంలో సరస్వతి దేవి రూపంలో..

బండి ఆత్మకూరు: మండలంలోని ఓంకార క్షేత్రంలో కొలువైన ఉమా మహేశ్వరీ అమ్మవారు సోమవారం సరస్వతి దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. పూజారులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం ఓంకార సిద్ధేశ్వర స్వామికి అభిషేకాలు చేశారు.

వెలుగోడు: పట్టణంలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారిని పురోహితులు తిరుపతయ్య సరస్వతీదేవి రూపంలో అలంకరించి పూజలు నిర్వహించారు. ఉదయం గ్రామోత్సవం నిర్వహించి వెండి బిందె కలశ పూజ చేశారు.



వెలుగోడులో..

కాలనీలోకి నీళ్లొచ్చినా స్పందించరా

● మండల సమావేశంలో అధికారులను ప్రశ్నించిన సభ్యులు



అధికారులను ప్రశ్నిస్తున్న సభ్యులు

మహానంది: కాలనీలోకి నీళ్లొచ్చినా స్పందించరా అంటూ ఎంపీటీసీ సభ్యుడు మునగాల మల్లికార్జున రెడ్డి, సర్పంచ్ కాకనూరు లక్ష్మిరెడ్డి అధికారులను ప్రశ్నించారు. తిమ్మాపురంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి మంత్రులు, ఎమ్మెల్యేలు గ్రామానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారని, కూటమి ప్రభుత్వంలో గ్రామం వైపు తొంగిచూసే నాథుడే లేకపోవడం తగదన్నారు. రైతులకు యూరియా సక్రమంగా అందలేడం లేదన్నారు. ఎంపీపీ యశస్విని మాట్లాడుతూ ఎలాంటి పక్షపాతం లేకుండా అధికారులు సేవలు అందించాలని సూచించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు కేవీఆర్ మహేశ్వరరెడ్డి, ఎంపీడీఓ మహబూబ్ దౌలా, ఏఓ నాగేశ్వరరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

ఇలా వచ్చారు.. అలా వెళ్లారు!

● మధ్యాహ్నానికే ఇంటికెళ్లిన డాక్టర్



ఖాళీగా దర్శనమిస్తున్న వైద్యాధికారి కుర్చీ

జూపాడుబంగ్లా: స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ గంగాధర్ క్యాజువల్ లీవు పెట్టగా మరో డాక్టర్ సభా సోమవారం యథావిధిగా ఉదయం విధులకు హాజరై మధ్యాహ్నానికే ఇంటికి వెళ్లారు. అనంతరం ఆసుపత్రికి వచ్చిన రోగులకు కిందిస్థాయి సిబ్బంది సీహెచ్ఓ, సూపర్ వైజర్లు, స్టాఫ్‌నర్సులు, ఫార్మాసిస్టులు, ఆరోగ్యకార్యకర్తలు వైద్యసేవలు అందించారు. కుమార్తెకు ఆరోగ్యం బాగోలేదని డాక్టర్ సభా మధ్యాహ్నం నుంచి ఇంటికి వెళ్లినట్లు వైద్యసిబ్బంది తెలిపారు. వైద్యులు వారి సమస్యల పరిష్కారం కోసం సమ్మెకు పిలుపునిచ్చినా వైద్య సిబ్బంది సూపర్‌వైజర్లు, సీహెచ్ఓలు, స్టాఫ్‌నర్సులు, ఫార్మాసిస్టులు, ఆరోగ్యకార్యకర్తలు రోగులకు వైద్యసేవలు అందించారు.

షాపుల లైసెన్స్ రద్దు చేయాలి



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

నందికొట్కూరు: నాసిరకం విత్తనాలు అంటగట్టి రైతులను మోసం చేసిన దుకాణాల లైసెన్స్ రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం పట్టణ సమీపంలోని రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాసిరకం మొక్కజొన్న విత్తనాలు విక్రయించిన పల్లవీ సీడ్స్, వెంకటేశ్వర ఏజెన్సీ, మహాగణపతి, రాయలసీమ సీడ్స్ షాపుల నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఎకరాకు రూ.50 వేలు పెట్టుబడి పెట్టి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని శాస్త్రవేత్తలతో పరిశీలించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగేశ్వరరావు, ఫక్కీర్ సాహెబ్, గోపాలకృష్ణ, ఉస్మాన్, వెంకటేశ్వర్లు, నాగన్న, బాబు, లక్ష్మన్న, రైతు సంఘం అధ్యక్షులు చిన్న పుల్లారెడ్డి, కార్యదర్శి శెట్టి రవిప్రసాద్, రైతులు రవిరెడ్డి, మాబాషా, మౌలాలి, దేవేంద్ర, మహేష్, శ్రీనివాసులు, కుమార్ పాల్గొన్నారు.

టీబీ నివారణపై అవగాహన అవసరం

● జిల్లా అదనపు వైద్యాధికారిణి డాక్టర్ శారదమ్మ



రికార్డులను తనిఖీ చేస్తున్న డాక్టర్ శారదమ్మ

బండిఆత్మకూరు: టీబీ వ్యాధి నివారణపై ప్రజల్లో అవగాహన అవసరమని జిల్లా అదనపు వైద్యాధికారిణి డాక్టర్ శారదమ్మ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడు వారాలకు పైగా దగ్గుతో బాధపడుతున్నా, రక్తంతో కూడిన కఫం వస్తున్నా, బరువు తగ్గుతున్నా వెంటనే సమీప ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. టీబీగా నిర్ధారణ అయితే ప్రభుత్వం ఉచితంగా మందులను అందజేస్తుందని, వాటిని క్రమం తప్పకుండా వాడది టీబీని పూర్తిగా నయం చేసుకోవచ్చన్నారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలో టీబీ బాధితుల రికార్డులను పరిశీలించి, వారికి సకాలంలో వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ ఏడాది 893 మందికి పరీక్షలు నిర్వహించగా 24 మంది టీబీ వ్యాధికి గురయ్యారని వైద్యులు సవిత, భావనరెడ్డి వివరించారు.

● సన్మానం



పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా ముచ్చుమర్రి పోలీసు స్టేషన్ కానిస్టేబుల్ జాషువాను సోమవారం నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, బ్రాహ్మణకొట్కూరు ఎస్ఐ తిరుపాలు, ఏఎస్ఐ శేషయ్య, పోలీసు సిబ్బంది ఘనంగా సన్మానించారు.

– పగిడ్యాల

మహానందిలో వర్షం



మహానంది: మహానందిలో వర్షం కురిసింది. సోమవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు పలు దఫాలుగా మోస్తరు వర్షం కురిసింది. మహానంది పుణ్యక్షేత్రంతో పాటు సమీప గ్రామాల పరిధిలో వర్షం కురిసింది.

డిజిటల్ బుక్.. కార్యకర్త చేతిలో బ్రహ్మాస్త్రం





డిజిటల్ బుక్ క్యూర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్ఆర్‌సీపీ నాయకులు,ఆత్మకూరులో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పాములపాడు: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించిన డిజిటల్ బుక్ ప్రతి కార్యకర్త చేతిలో బ్రహ్మాస్త్రం లాంటిదని ఆ పార్టీ మండల అధ్యక్షుడు నాగరాజు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి అరాచకాలు రోజు రోజుకు ఎక్కువవుతున్నాయన్నారు. కొందరు ప్రభుత్వ అధికారులు కూడా వారికి కొమ్ము కాస్తూ వైఎస్ఆర్‌సీపీ కార్యకర్తలు, అభిమానులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. అన్యాయానికి గురైన వారు వెంటనే డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి సమస్యకు సంబంధించిన వివరాలు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచు కోట్ల చంద్రారెడ్డి, ఎంపీటీసీ సురేష్, కో ఆప్టెడ్ ముర్తుజావలి, సొసైటీ మాజీ చైర్మన్ గడ్డం క్రిష్టారెడ్డి, మాజీ సర్పంచు బాలునాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు జబ్బార్, క్రిష్టారెడ్డి, చలమారెడ్డి, రఘురామిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అంబయ్య, ఓబన్నగౌడు, శేషులు, లింగస్వామి, యుగంధర్‌రెడ్డి, శివలింగం, పుల్లయ్య, స్వామిదాసు, కమలాకర్, చరణ్, దరగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ పట్టణ అధ్యక్షులు సయ్యద్‌మీర్ డిజిటల్ బుక్ యాప్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన నాయకులు సుల్తాన్, విజయ్‌చౌదరి, సురేష్, నాగరాజు, మోమిన్‌మున్నీర్ బాషా, వెంకటస్వామిగౌడ్, బాలస్వామియాదవ్‌లతో కలిసి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ విధానానికి వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రూపొందించిన డిజిటల్ బుక్ యాప్ తమ కార్యకర్తలకు కొండంత అండగా నిలుస్తోందన్నారు. కూటమి నాయకుల నుంచి ఎలాంటి అన్యాయం జరిగినా యాప్‌లో పొందుపరచాలని కార్యకర్తలకు సూచించారు. రాబోయే రోజుల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్యాయానికి పాల్పడిన కూటమి నేతలు మూల్యం చెల్లించకతప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు దర్గమ్మ, షఫీవున్, రవణమ్మ, మరియమ్మ, మహబూబ్‌బాషా, రషీద్, ధనుంజయ, లాలు, శ్రీనివాసగౌడ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పగిడ్యాల: వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పుల్యాల నాగిరెడ్డి సోమవారం తన నివాసంలో కార్యకర్తలతో కలిసి డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తమ పార్టీ కార్యకర్తలను టార్గెట్ చేసి వేధింపులకు గురి చేస్తోందన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తూ కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను భవిష్యత్‌లో గుర్తు పెట్టుకునేందుకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకొచ్చిన డిజిటల బుక్ కార్యకర్తల్లో ఆత్మస్థైర్యాన్ని నింపుతోందన్నారు. కూటమి నాయకుల ఆరాచకాలను ఎప్పటికప్పుడు స్కాన్‌చేసి రిజిష్టర్ చేస్తే అధికారంలోకి వచ్చాక ఎవ్వరిని వదిలిపెట్టేదిలేదని, వారికి తగిన బుద్ధి చెబుతామన్నారు. కార్యక్రమంలో సర్పంచు పెరుమాళ్ల శేషన్న, నాయకులు భాస్కర్‌రెడ్డి, గోవిందరెడ్డి, వెంకటనాగేశ్వరరెడ్డి, మద్దిలేటిరెడ్డి, సుధాకర్, ప్రసాద్, ఈశ్వరరెడ్డి, వెంకటేశ్వర్లు, మాబు, జంబులయ్య, శేషన్న పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

కొత్తపల్లి: మండల కేంద్రానికి చెందిన ఓ మహిళ అదృశ్యమైంది. ఏఎస్ఐ రామ్‌నాయక్ తెలిపిన వివరాలు.. గనమల లక్ష్మీదేవి(28) ఆదివారం రాత్రి ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా వెతికినా ఆచూకీ లేకపోవడంతో లక్ష్మీదేవి తండ్రి బాలరాజు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు.

ఉపాధి కూలీలకు అక్షరాలు నేర్పించాలి

కొత్తపల్లి: మండలంలోని ఉపాధి కూలీలకు అక్షరాలు నేర్పించాలని ఎంపీడీఓ మేరి సూచించారు. సోమవారం ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయం వద్ద ఉల్లాస్–అక్షర ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి వలంటీర్లకు ఏపీఓ విమలమ్మ ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో పనులకు హాజరవుతున్న ఉపాధి శ్రామికులలో నిరక్షరాస్యులను గుర్తించి వారు మస్టర్లలో సంతకం చేసే విధంగా అక్షరాలు నేర్పించాలన్నారు.

మహానందిలో ఆర్‌జేసీ పూజలు



ఆర్‌జేసీ ఆజాద్‌కు జ్ఞాపికను అందిస్తున్న ఈఓ

మహానంది: దేవదాయ శాఖ కమిషనర్ ఎస్ఎస్ చంద్రశేఖర ఆజాద్ కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం కామేశ్వరీదేవి, మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకున్నారు. ఆలయ ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆయనకు స్వాగతం పలికారు. యాగశాల వద్ద స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు. దసరా నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లు, జరుగుతున్న తీరుతెన్నులపై ఆయన ఈఓను అడిగి తెలుసుకున్నారు.

సబ్సిడీతో విత్తనాలు ఇవ్వాలి



ధర్నా చేస్తున్న పార్టీ నాయకులు

నందికొట్కూరు: రైతులకు రబీ సీజన్‌లో 50 శాతం సబ్సిడీతో శనగ, మినుము విత్తనాలు అందించాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం వ్యవసాయ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రైవేట్ వ్యక్తల వద్ద నాసిరకం విత్తనాలు కొనుగోలు చేసి మోసపోతున్నారన్నారు. ప్రభుత్వమే సబ్సిడీ విత్తనాలు అందజేసి ఆదుకోవాలని కోరారు. అధిక వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.40 వేల చొప్పున పరిహారం అందజేయాలన్నారు. అనంతరం వ్యవసాయ అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఏసన్న, న రసింహులు, రామకృష్ణ, రైతు సంఘం నాయకులు దాసు,సుధాకర్,శ్రీరాములు,సోమప్ప పాల్గొన్నారు.

వైభవంగా చండీయాగం



చండీయాగం నిర్వహిస్తున్న పండితులు

మహానంది: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం మహానందిలో ఈఓ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో చండీయాగం నిర్వహించారు. మూలమూర్తి కామేశ్వరీదేవి అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సరస్వతీ అమ్మవారి జన్మనక్షత్రం కావడంతో వేద పండితులు బ్రహ్మశ్రీ చెందూరి రవిశంకర అవధాని ఆధ్వర్యంలో పలువురి చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అలాగే బుక్కాపురంలోని దుర్గా మాత సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.